సాక్షి అనంతపురం

ఆదివారం । 16 । జూలై । 2023



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



'కీ'లకమైనా కీలుబొమ్మలే!

రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖలో కీలకమైన ఉద్యోగుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం 38.9°/22.7°

జిల్లా అంతటా శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం తగ్గింది. ఉక్కపోత పెరిగింది.

న్యూస్‌రీల్

జల సంరక్షణకు శ్రీకారం

- ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల తవ్వకాలు



ఇంకుడు గుంత (ఫైల్)

అనంతపురం టౌన్: జల సంరక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వర్షపునీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకింపజేసేందుకు ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టేలా గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు తవ్వించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. వర్షపు నీరు ఇంకేందుకు అనువైన స్థలాలు గుర్తించాలని ఇప్పటికే ఉపాధి హామీ పథకం ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. గుంతలు తవ్వడంతోపాటు వాటిలో రాళ్లు నింపేందుకు ప్రత్యేక నిధులు కేటాయించారు. ప్రతి గుంతకూ రూ.70వేల వరకు ఉపాధి హామీ నిధులను ఖర్చు చేయనున్నారు. ఆయా కార్యాలయ అధికారులు సూచించిన వ్యక్తి లేదా సంస్థలకు ఇంకుడు గుంతల నిధులను జమ చేయనున్నారు. రెండు మూడు రోజుల్లో గుంతలు తవ్వే కార్యక్రమాన్ని ప్రారంభించి నెలాఖరులోపు పనులు పూర్తి చేస్తామని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

నిరసనలు చేపట్టండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: అంకితభావంతో నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ శ్రేణులు, వలంటీర్లకు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్, వరదలు ఇలా ఏ విపత్తు వచ్చినా వలంటీర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించారన్నారు. వలంటీర్ల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు లేదన్నారు. దమ్మూ ధైర్యం ఉంటే వలంటీర్ల వ్యవస్థను తొలగిస్తామని మీ మేనిఫెస్టోలో పొందుపరచాలన్నారు. ప్రధాని మోదీ, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను స్వాగతిస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేక టీడీపీ, జనసేన నేతలు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు.

నూతన డీఆర్‌ఎంగా మనీష్ అగర్వాల్

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం)గా నార్త్ ఈస్ట్ అండ్ రైల్వే డివిజనల్ మేనేజర్ మనీష్ అగర్వాల్ నియమితులయ్యారు. రైల్వే బోర్డు ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా సాధారణ బదిలీల్లో భాగంగా 35 మంది డీఆర్‌ఎంలకు స్థాన చలనం కలిగింది. అందులో భాగంగా ఇక్కడ డీఆర్‌ఎంగా పనిచేస్తున్న కె.వెంకటరమణారెడ్డి బదిలీ అయ్యారు. అయితే ఆయనకు పోస్టింగ్ ఎక్కడ అనేది పేర్కొనలేదు.

రెండు మ్యాచ్‌ల డ్రా

అనంతపురం: సీనియర్ అంతర జిల్లా క్రికెట్ మల్టీ డే టోర్నీలో భాగంగా అనంతపురం-కర్నూలు, నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య జరిగిన నాలుగో రౌండ్ మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 254 పరుగులు చేయగా అనంతపురం రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. అనంతపురం ఒక ఇన్నింగ్స్ ఆధిక్యతలో నిలవడంతో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. అలాగే నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు ఒక ఇన్నింగ్స్ లీడ్‌లో నిలవడంతో మ్యాచ్ డ్రా అయింది.

విద్యా సౌరభం



- రేపు ఎస్కేయూ 21వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా చాన్సలర్/గవర్నర్ నజీర్ రాక
- విశిష్ట అతిథిగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి
- 9,150 మందికి స్నాతకోత్సవ పట్టాలకు గవర్నర్ ఆమోద ముద్ర



గవర్నర్ అబ్దుల్ నజీర్

అనంతపురం: రాష్ట్రంలో అగ్రగామి యూనివర్సిటీల్లో ఒకటైన ఎస్కేయూ 21వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. సోమవారం అట్టహాసంగా స్నాతకోత్సవ సంబరం జరగనుంది. ఏపీ గవర్నర్/యూనివర్సిటీల చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి విశిష్ట అతిథిగా రానున్నారు. 2003-04లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి అప్పటి గవర్నర్ సుర్జీత్‌సింగ్ బర్నాలా హాజరయ్యారు. తర్వాత 20 ఏళ్లకు గవర్నర్ పాల్గొంటుండటం గమనార్హం.

9150 మందికి డిగ్రీల ప్రదానం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవంలో 9,150 మందికి డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. ఇందులో 1,143 పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీ 6,794, దూరవిద్య పీజీ, యూజీ, బీఈడీ 1,213 స్నాతకోత్సవ పట్టాలకు గవర్నర్/చాన్సలర్ ఆమోద ముద్ర వేశారు.

విభాగాల వారీగా...

బీఎస్సీ విభాగంలో 3,375 మందికి, బీఏ 408, బీకాం 2,390, బీఈడీ 265, బీ ఫార్మసీ 38, బీపీఈడీ 6, బీఎల్ 141, బీటెక్ 171, దూరవిద్య పీజీ 308, యూజీ 852, బీఈడీలో 53 మందికి స్నాతకోత్సవ పట్టా ప్రదానం చేస్తారు.

57 మందికి పతకాలు

స్నాతకోత్సవంలో 2022 విద్యా సంవత్సరానికి సంబంధించి 57 మందికి పతకాలు అందించనున్నారు. ఇందులో బంగారుపతకాలు 39, స్మారక బహుమతులు 12, నగదు బహుమతులు 2, యూనివర్సిటీ ప్రత్యేక బహుమతులు 4 అందజేయనున్నారు.

మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్

ఎస్కేయూ 21వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్‌ను మహంతేష్ జి. కివాడసన్నవర్ (మహంతేష్ జీ.కే)కు ప్రదానం చేయనున్నారు. కర్ణాటక రాష్ట్రం నేగినహాళ్‌కు చెందిన మహంతేష్ భారత మాజీ క్రికెటర్. దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇండియా, వరల్డ్ బ్లైండ్ క్రికెట్ లిమిటెడ్‌కు ఆయన అధ్యక్షుడిగా సేవలందించారు. 2012లో బ్లైండ్ వరల్డ్ టి-20 విజేతగా టీమిండియా నిలవడంలోనూ, 2017లో రెండో స్థానం సంపాదించడంలోనూ కీలక పాత్ర పోషించారు. 2014, 2018లో వరల్డ్ చాంపియన్‌షిప్ పొందడంలో మహంతేష్ కృషి ఎంతో ఉంది. అంధుల క్రికెట్ ఆటకు రూపకల్పన చేసి, ఎంతోమంది క్రీడాకారులను తీర్చిదిద్దారు. సమర్థనం అనే ట్రస్ట్ ద్వారా వేలాదిమంది దివ్యాంగులకు ఉపాధి, విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. 2019లో స్పిరిట్ స్పోర్ట్స్ ఇండియా అవార్డు, దివ్య జ్ఞాన ఎంపవర్‌మెంట్ అవార్డు ఆయన్ని వరించాయి. మహంతేష్ జీకే సేవలు గుర్తించిన గవర్నర్ ఆయన్ను గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు.



మహంతేష్

నేడు గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక

గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం అనంతపురం రానున్నారు. గవర్నర్ హోదాలో తొలిసారిగా జిల్లాకు వస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. విజయవాడ నుంచి నేరుగా బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు విమానంలో వస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అనంతపురం వస్తారు. రాత్రి 9 గంటలకు గవర్నర్ స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని, అక్కడే బస చేస్తారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అల్పాహారం ముగించుకుని రోడ్డుమార్గాన ఎస్కేయూకు చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు స్నాతకోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం విజయనగర లా కళాశాలలో జరిగే కార్యక్రమానికి గవర్నర్ హాజరవుతారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం: గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ నెల 16, 17 తేదీల్లో అనంతపురంలో పర్యటించనున్నారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి శనివారం పరిశీలించారు. ఎస్కేయూలో గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న అకడమిక్ బ్లాక్ పనులను పరిశీలించి, సలహాలు సూచనలు ఇచ్చారు. భువన విజయం ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవానికి సంబంధించిన విషయాలపై వీసీ రామకృష్ణారెడ్డితో ఆరా తీశారు. అనంతరం హౌసింగ్ బోర్డులోని విజయనగరం లా కళాశాలను సందర్శించి గవర్నర్ పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. తర్వాత రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహాన్ని సందర్శించి వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఆర్డీఓ మధుసూదన్, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

డీఐజీ పరిశీలన : ఎస్కేయూ క్యాంపస్‌లో స్నాతకోత్సవం నిర్వహించే భువన విజయం ఆడిటోరియం పరిసరాలను డీఐజీ ఆర్.ఎన్. అమ్మిరెడ్డి పరిశీలించారు. వీసీతో కలిసి గవర్నర్ పర్యటించే ప్రాంతాల్లో కలియదిరిగారు. అనంతరం విజయనగర లా కళాశాలలో భూమి పూజ, తదితర ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లు, భద్రత చర్యలను సమీక్షించారు. డీఐజీ వెంట ఎస్పీ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ హనుమంతు, డీఎస్పీలు శివారెడ్డి, జి.ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

ముచ్చటగా మూడోసారి స్నాతకోత్సవం



వీసీగా బాధ్యతలు చేపట్టాక మూడోసారి స్నాతకోత్సవం నిర్వహించే అవకాశం దక్కడం విశేషం. ఈ స్నాతకోత్సవానికి గవర్నర్ వస్తుండడం గర్వకారణంగా ఉంది. గత రెండున్నరేళ్లలో అకడమిక్‌లో పురోగతి సాధించడానికి వీలుగా అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. తప్పనిసరిగా తరగతులు నిర్వహించేలా అధ్యాపకుల్లో మార్పు తెచ్చాం. క్యాంపస్‌లో క్రమశిక్షణ వాతావరణం నెలకొంది. ఉద్యోగులు సమయపాలన, అంకితభావంతో కృషి చేసేలా ప్రోత్సహిస్తున్నాం. బోధన, పరిశోధనల్లో ఎస్కేయూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోకి అగ్రగామిగా నిలిచింది.

– ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

స్త్రీ, శిశు సంక్షేమ జాయింట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే పద్మావతి



శింగనమల: స్త్రీ, శిశు సంక్షేమ జాయింట్ కమిటీ చైర్‌పర్సన్‌గా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం నియమించారు. అలాగే 12 మందిని సభ్యులుగా నియమించారు. వీరిలో కె.శ్రీదేవి, ఎస్.ధనలక్ష్మి, రెడ్డి శాంతి, డాక్టర్ ఎం.జగన్‌మోహన్‌రావు, డాక్టర్ దాసరి సుధ, డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ సత్యసూర్యనారాయణ రెడ్డి, ఆదిరెడ్డి భవాని, వరుధు కళ్యాణి, టి.కల్పలత, పి.అనురాధ ఉన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దండి




మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: డిజిటల్ బోధనపై శిక్షణ పొందిన టీచర్లు సంబంధిత అంశంపై విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈఓ ఎం.సాయిరామ్ సూచించారు. ఐఎఫ్‌పీల వినియోగంపై జిల్లాలోని 27 మండలాలకు చెందిన 5,300 మంది టీచర్లకు ఈ నెల 1 నుంచి ప్రారంభమైన శిక్షణ శనివారంతో ముగిసింది. ఒక్కో టీచరుకు రెండు రోజుల చొప్పున శిక్షణ ఇచ్చారు. ఎస్కేయూ సమీపంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి డీఈఓ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా విజ్ఞానాన్ని అందించే లక్ష్యంతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జిల్లాలో తొలివిడతగా 534 పాఠశాలలకు 1,595 ఐఎఫ్‌పీలు, 759 స్మార్ట్ టీవీలను ప్రతి తరగతి గదిలో ఒకటి చొప్పున ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. వీటిని సక్రమంగా ఉపయోగించడంతోపాటు వాటి పరిరక్షణ బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. శిక్షణలో ఉపాధ్యాయులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ఉన్నత శ్రేణి డిజిటల్ విజ్ఞానాన్ని అందజేసిన ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. ఏఎస్‌ఓ ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

చిరునామాల దిద్దుబాటు

- ఇంటి నంబరు లేని 9,390 ఓట్ల గుర్తింపు
- 6,983 ఓటర్ల ఇంటి నంబర్ల సరిజేత
- పరిశీలన దశలో మరో 2,407 ఓట్లు



అనంతపురంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)

అనంతపురం అర్బన్: ఓట్ల నమోదు ప్రక్రియలో సిబ్బంది తప్పిదం కారణంగా కొందరి డోర్ నంబర్లు నమోదు కాలేదు. కొందరికేమో ఇంటి నంబరు 0 (సున్నా)గా నమోదు చేశారు. మరికొన్ని ఓట్లకు ఇంటి నంబరు స్థానంలో స్టార్, యాష్, తదితర గుర్తులు (జంక్ క్యారెక్టర్స్) నమోదయ్యాయి. వాస్తవంగా ఓటర్లు ఉన్నప్పటికీ చిరునామాలో ఇంటి నంబరు లేకపోవడం, 0 డోర్ నంబర్ ఉండడం, జంక్ క్యారెక్టర్స్ కారణంగా ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇలాంటి ఓట్లను సరిదిద్దే ప్రక్రియను జిల్లా ఎన్నికల యంత్రాంగం చేపట్టింది.

9,390 ఓట్ల గుర్తింపు

జిల్లావ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో మొత్తం 19,39,163 ఓట్లు ఉండగా ఇందులో ఇంటి నంబరు 0 (సున్నా)గా ఉన్నవి, ఇంటి నంబరు లేనివి, జంక్ క్యారెక్టర్స్‌తో నమోదైనవి 9,390 ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో అత్యధికంగా రాప్తాడు నియోజకవర్గంలో 2,499, రెండో స్థానంలో ఉరవకొండ నియోజవర్గంలో 2,061, మూడో స్థానంలో గుంతకల్లు నియోజకవర్గంలో 1,245 ఓట్లు ఉన్నాయి. అత్యల్పంగా అనంతపురం అర్బన్ నియోజవర్గం పరిధిలో కేవలం 33 ఓట్లు ఉన్నాయి.

సరిదిద్దుతున్న యంత్రాంగం

ఇంటి నంబరు 0 (సున్నా)గా ఉన్నవి, ఇంటి నంబరు లేనివి, జంక్ క్యారెక్టర్స్‌తో నమోదైన వాటిని సరిదిద్దేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపట్టింది. సదరు ఓటరుకు సంబంధించి ఇంటి నంబరు ఆధారం (ఆధార్, పాన్‌కార్డ్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, తదితర కార్డులు) నకలు తీసుకుని ఫారం-8 ద్వారా సరిచేస్తున్నారు. ఇప్పటి వరకు 6,983 ఓట్లు సరిదిద్దారు. పరిశీలన దశలో 2,407 ఓట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. త్వరలో వీటి ఇంటి నంబరు కూడా సరిచేస్తారని చెప్పారు.

21 నుంచి ఓటరు జాబితా సవరణ

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఈ నెల 21న ప్రారంభం కానుంది.

- ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బూత్ లెవల్ అధికారు(బీఎల్‌ఓ)లు ఇంటింటికీ వెళ్లి జాబితా మేరకు ఓటర్ల వివరాలను పరిశీలన చేస్తారు.
- ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 29 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జాబితా సవరణ పనులు నిర్వర్తించాలి.
- సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 16 వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ నిర్వహిస్తారు. 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ.
- ఓటరు జాబితా సవరణపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను అక్టోబరు 17 నుంచి నవంబరు 30వ వరకు స్వీకరిస్తారు.
- డిసెంబరు 26 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరిస్తారు.

ఇప్పటి వరకు సరిదిద్దిన ఓట్లు...

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	ఇంటి నంబరు లేనివి, 0 ఇంటి నంబరు, జంక్ క్యారెక్టర్ ఓట్లు
రాయదుర్గం	2,54,661	617
ఉరవకొండ	2,15,481	2,061
గుంతకల్లు	2,60,353	1,245
తాడిపత్రి	2,39,216	835
శింగనమల	2,39,349	1,503
అనంతపురం	2,62,456	33
కళ్యాణదుర్గం	2,22,234	597
రాప్తాడు	2,45,413	2,499
మొత్తం	19,39,163	9,390

- 2024 జనవరి 1న ఓటర్ల జాబితా సిద్ధం చేస్తారు.
- 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

కనిపించని 'ప్రత్యామ్నాయం'

- వర్షాభావంతో అంచనాకు చేరువ కాని విత్తు
- ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి పెట్టని వ్యవసాయశాఖ

అనంతపురం అగ్రికల్చర్: విత్తుకు అత్యంత కీలకమైన జూలై నెలలో ఇప్పటి వరకూ ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. గత నెల 61 మి.మీ గానూ 25 శాతం తక్కువగా 46 మి.మీ వర్షపాతం నమోదు కాగా, తాజాగా ఈ నెలలో 63.9 మి.మీ గానూ 20 మి.మీలోపు నమోదైంది. వర్షాభావ పరిస్థితి మరికొద్దిరోజులు కొనసాగితే చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలపై ఇప్పటికే వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా దృష్టి సారించలేదు.

వాస్తవ విరుద్ధ లెక్కలు

ఖరీఫ్‌లో తాడిపత్రి డివిజన్‌తో పాటు మరో ఐదారు మండలాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం అనుకున్నంతగా లేదు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3.70 లక్షల హెక్టార్ల సాధారణ సాగుగా అధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటి వరకూ 38 వేల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. వాస్తవానికి 50 వేల నుంచి 60 వేల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చినట్లు సమాచారం. సాగు విస్తీర్ణం లెక్కలను పక్కాగా సేకరించుకోవడంలోనూ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరించారని తెలుస్తోంది. సాగు వివరాలు పక్కాగా లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చినుకు పడకపోతే పంట పరిస్థితి ఏమిటి?

నెలాఖరు లోపు సరైన వర్షాలు పడకపోతే ప్రత్యామ్నాయ పంటల పరిస్థితి ఏమిటనే సమాచారం జిల్లా వ్యవసాయ శాఖ నేటికీ క్షేత్రస్థాయి నుంచి సేకరించిన దాఖలాలు లేవు. ఖరీఫ్‌లో పంటలు విత్తుకునేందుకు ఆరుద్రతో పాటు పునర్వసు, పుష్యమి కార్తెలు అదనుగా రైతులు భావిస్తారు. ఇందులో ఆరుద్ర ముగిసిపోగా, ప్రస్తుతం పునర్వసు నడుస్తోంది. ఈ నెల 20 నుంచి పుష్యమి ప్రారంభమవుతుంది. మొత్తమ్మీద చూస్తే... ఆగస్టు 3వ తేదీ వరకూ పంటలు సాగు చేసుకోవచ్చని చెబుతున్నారు. ఆ తర్వాత ఏమిటనే దానిపై వ్యవసాయశాఖ స్పష్టత ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో నేటికీ ప్రత్యామ్నాయ పంటల సాగుకు కనీసం ప్రణాళిక కూడా తయారు చేయని పరిస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయానికి సంబంధించి నేల రకాలు, ప్రాంతాల వారీగా విత్తన ప్రతిపాదనలు ముందస్తుగానే ప్రభుత్వానికి పంపితే తమకెంతో వెసులుబాటు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఏఆర్ఎస్, కేవీకే, ఏరువాక కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలతో కలసి చర్చించి ప్రణాళిక రూపొందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు.

క్లుప్తంగా

జేఏ పోస్టుల అర్హుల జాబితా విడుదల

- 26న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 63 మండలాలకు 63 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను శనివారం ఆమె వెల్లడించారు. ఏపీపీఎస్ గతంలో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారి జాబితాను అనుసరించి మెరిట్ మేరకు 1:2 నిష్పత్తితో 126 మందితో తుది జాబితా విడుదల చేసినట్లు వివరించారు. ఈ జాబితాను రెండు జిల్లాల పరిధిలోని ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాలతో పాటు www.ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. జాబితాలో పేరు ఉన్న అభ్యర్థులు ఈ నెల 26న అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు అన్ని సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలన్నారు. జాబితాలోని అర్హులకు కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (సీపీటీ) ఉంటుందన్నారు. ఈ పరీక్ష నిర్వహించే తేదీని తదుపరి తెలియజేస్తామన్నారు.

కలల ప్రాజెక్టుపై పచ్చ కుట్ర

- జిల్లేడుబండ ప్రాజెక్టును స్వాగతిస్తున్న అన్నదాతలు
- రిజర్వాయర్ కట్ట పనులు మాత్రమే చేపడుతున్న అధికారులు
- రైతుల భూముల్లో ఇప్పటి వరకు ఎలాంటి పనులూ జరగని వైనం
- అయినా నిర్వాసితుల గోడు పట్టించుకోలేదని ఈనాడు అసత్య కథనం
- మెరుగైన పరిహారం అందించేందుకు చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాంగం
- భూసేకరణకు మొదటివిడతగా రూ.80 కోట్లతో ప్రతిపాదనలు పంపిన అధికారులు


జిల్లేడు బండ ప్రాజెక్టు పనులు చేపడుతున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముదిగుబ్బ మండలంలో జిల్లేడు బండ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో తాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా పరిష్కారం కావడంతో పాటు సుమారు 23 వేల ఎకరాల భూమి సాగులోకి రానుంది. ఇంతటి బృహత్తర ప్రాజెక్టు రావడంతో రెండు నియోజకవర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతుంటే.. ప్రజల గోడు పట్టించుకోవడం లేదంటూ 'పచ్చ'పత్రిక అచ్చేసింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఇప్పటి వరకూ ఏ ఒక్కరైతూ నష్టపోయిన దాఖలాలు లేవు. కాగా నిర్వాసితుల గోడు పట్టించుకోవడం లేదంటూ ఈనాడు తప్పుడు రాతలు రాసింది. రైతులకు మెరుగైన పరిహారం ఇప్పించాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే, హంద్రీ–నీవా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సీఎం జగన్ చొరవతో ప్రాజెక్టు..

వర్షాధారంపైనే ఆధారపడిన ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ జిల్లేడుబండ ప్రాజెక్టుకు నాంది పలికారు. 2020 సెప్టెంబర్‌లో రూ.680 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టు సంస్థ ఇప్పటికే పనులు మొదలుపెట్టింది. ధర్మవరం నియోజకవర్గంలో ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాలు, పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం మండలంలో 23 వేల ఎకరాలకు సాగునీరందించే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. హంద్రీ–నీవా మెయిన్ కెనాల్ 377వ కిలోమీటరు (బుక్కపట్నం మండలం మారాల సమీపంలో) వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేసి జిల్లేడు బండ ప్రాజెక్టుకు కృష్ణాజలాలను విడుదల చేయనున్నారు. 2.41 టీఎంసీల నీళ్లు గ్రావిటీ ద్వారా రానున్నాయి.

మెరుగైన పరిహారం కోసం కసరత్తు..

కాంట్రాక్టు సంస్థ 2022 జూన్‌లో పనులు మొదలు పెట్టింది. ప్రస్తుతం రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు చేస్తోంది. 2.41 టీఎంసీల నీరు నిల్వ చేసేందుకు సుమారు 7.2 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించాల్సి వస్తోంది. భూములకు సాగునీరు అందించడానికి ముదిగుబ్బ మండలంలోని మంగళమడక, చాగాపురం, గుంజేపల్లి, బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామాల పరిధిలో భూసేకరణ చేయాల్సి ఉంది. 2,327 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ప్రస్తుతం కట్ట నిర్మాణ పనులు మాత్రమే చేస్తున్నారు. రైతుల భూముల్లో ఎలాంటి పనులూ చేపట్టలేదు. అయినప్పటికీ రైతులకు త్వరితగతిన పరిహారం ఇప్పించడానికి, అది కూడా మెరుగ్గా అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే భూసేకరణకు మొదటి విడతగా ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) బడ్జెట్ కోసం రూ. 80 కోట్లకు ప్రాతిపాదనలు పంపారు. త్వరలో పరిహారం అందించడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశముందని హంద్రీ–నీవా అధికారవర్గాలు వెల్లడించాయి.

రైతుల్లో సంతోషం



జిల్లేడుబండ ప్రాజెక్టు కింద ఎడమ కాలవ పరిధిలో నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. వర్షాధార పంటలు వేసుకుంటుండటంతో ఒకసారి పంటలు పండితే ఐదారేళ్లు నష్టాలు వస్తున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే ఆయకట్టు కిందే పంటలు సాగు చేసుకుంటాం. నేనొక్కడినే కాదు మా గ్రామంలో ప్రతి రైతూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ప్రాజెక్టు పనులు జరుగుతుంటే రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

– వేణుగోపాల్‌రెడ్డి, జొన్నలకొత్తలపల్లి, ముదిగుబ్బ మండలం

చకచకా ప్రాజెక్టు పనులు



జిల్లేడు బండ ప్రాజెక్టు బృహత్తరమైనది. వర్షాధారంపై ఆధారపడిన ప్రాంతాల్లోకి కృష్ణా జలాలు వస్తే ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుంది. ప్రాజెక్టు పనులు చకచకా జరుగుతున్నాయి. మూడేళ్లలో పూర్తి చేసి ఆయకట్టుకు నీరివ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. భూములు కోల్పోయిన రైతులకు త్వరలో పరిహారం ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నాం. మొదటి విడత పరిహారం అందించడానికి రూ.80 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. – దేశేనాయక్, ఎస్‌ఈ, హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు

ఊహాజనిత కథనాలు రాయొద్దు

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే బీసీలకు పెద్దపీట
- పచ్చ పత్రికలకు వైఎస్సార్‌సీపీ నేతల హితవు


మాట్లాడుతున్న గాదిలింగేశ్వరబాబు

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీలో అసమ్మతి రాజుకుంటోందని ఓ పచ్చ పత్రిక రాసిన కథనాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీని వీడుతున్నట్లు అదే పచ్చపత్రిక ఇప్పటికీ రెండోసార్లు కథనాన్ని ప్రచురించడాన్ని గాదిలింగేశ్వరబాబు తీవ్రంగా తప్పుబట్టారు. వివరణ లేకుండా ఊహాజనితమైన కథనాలు రాయడం సరికాదన్నారు. బీసీలు, ప్రత్యేకించి వాల్మీకులకు పెద్ద పీట వేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ నేనని పేర్కొన్నారు. పార్టీలో నేతల మధ్య చిన్నపాటి మనస్పర్థలు చోటు చేసుకుంటే సరిదిద్దేందుకు పార్టీ పెద్దలున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్ మోహన్, వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ కన్వీనర్ ఎద్దుల శంకర్, కౌన్సిలర్లు భాస్కర్, రవి, ప్రభాకర్, వార్డు ఇన్‌ఛార్జులు బట్నాపాడు సుంకప్ప, మార్కెట్ వెంకటేష్, సీనియర్ నాయకుడు మల్లికార్జున శాస్త్రి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం


మృతుడు సుబాన్‌వలి

గుంతకల్లు టౌన్: రాతి గోడ కూలడంతో ఓ భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని పోర్టర్స్ లైన్‌కు చెందిన ముల్లా సుభాన్‌వలి (48) అలియాస్ రిక్షా బాషా, షహేజాది దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భవన నిర్మాణ రంగ కాంట్రాక్టర్ అబ్దుల్ అజీజ్ వద్ద సుభాన్‌వలి దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు భాగ్యనగర్‌లో కొనుగోలు చేసిన పాత ఇంటిని కూలదోసే పనిని అబ్దుల్ అజీజ్ ఒప్పుకోవడంతో శనివారం పనుల్లో సుభాన్ వలి పాల్గొన్నాడు. మధ్యాహ్నం సమ్మెటతో రాతి గోడను కొడుతుండగా పైనున్న సిమెంట్ కాంక్రీట్ లింటల్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో సుభాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్‌ఐ మురహరి బాబు అక్కడకు చేరుకుని పరిశీలించారు. శిథిలాల్లో చిక్కుకున్న సుబాన్‌వలి మృతదేహాన్ని వెలికి తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దోమకాటు నివారణ చర్యలు చేపట్టండి

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం క్రైం: జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు నమోదయ్యాయని, ఈ నేపథ్యంలో దోమకాటు నివారణ చర్యలు ముమ్మరం చేయాలని సంబంధిత సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. 'డెంగీ కలవరం' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మలేరియా విభాగం అధికారులతో సమావేశమై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. గ్రామ, వార్డు ఆరోగ్య కార్యదర్శులను సమన్వయం చేసుకుని ప్రతి శుక్రవారం డ్రైడే, వెక్టర్ కంట్రోల్ హైజీన్, ఫీవర్ సర్వే కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు, సూపర్‌వైజర్లు ఇందులో భాగస్వాములవ్వాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫీవర్ సర్వేపై సిబ్బందికి జిల్లా మలేరియా అధికారి ఓబులు శిక్షణనిచ్చారు.

వాయు కాలుష్య కారక వాహనాలను గుర్తించండి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ గౌతమి


పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, అధికారులు

అనంతపురం అర్బన్: భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ గౌతమి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రధానమైన వాయు కాలుష్యాన్ని నియంత్రించాలని, ఈ క్రమంలో నగరాలు, పట్టణాల్లో వాయు కాలుష్య కారక వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే క్రమంలో పరిశ్రమల నుంచి వెలువడే కార్బన్ ఉద్గాటాలు నియంత్రణ చర్యలపై యాజమాన్యాలను చైతన్య పరచాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పర్యావరణ ప్రణాళిక సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి చేపట్టిన కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు ఆ శాఖ అధికారులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా వాయు కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని మండలి అధికారి కిషోర్‌రెడ్డిని ఆదేశించారు. నగర, పట్టణాల్లో వాయు కాలుష్యం నియంత్రపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాయు కాలుష్యం నియంత్రణ మండలి మార్గదర్శకాల మేరకు ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించి పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియలో నగర, పురపాలక సంఘాలు, పోలీసు, కాలుష్య నియంత్రణ మండలి, వైద్యారోగ్యశాఖ, రవాణా, తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డీటీసీ వీర్రాజును ఆదేశించారు. ఇక నుంచి తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని రోడ్ల మీద, పక్కన అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణకు ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించాలని, దీని ఆధారంగా రాష్ట్రస్థాయి ప్రణాళిక రూపొందిస్తారన్నారు. ప్రణాళిక అమలులో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిఘా ఉంటుందని, లోపాలుంటే నోటీసులు జారీ చేస్తుందన్నారు. కోర్టుకు ఉండే అధికారాలు ట్రిబ్యునల్‌కూ ఉంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ యుగంధర్, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, డీటీసీ వీర్రాజు, డీపీఓ ప్రభాకర్‌రావు, నగర పాలక ఏసీ రమణారెడ్డి, భూగర్భజల శాఖ డీడీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

దళారుల మధ్య ఘర్షణ


దళారీని అదుపులోకి తీసుకుంటున్న పోలీస్ కానిస్టేబుల్


అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాజహంస అపార్టుమెంట్ సమీపంలో శనివారం ఉదయం గొర్రెల దళారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రానికి (బీకేఎస్) చెందిన బాలు, నార్పల మండలం నాయనపల్లి నివాసి నారాయణస్వామి గొర్రెల దళారీ వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. కాపరులకు తక్కువ ధర చెల్లించి, తెలంగాణకు చెందిన వ్యాపారులకు అధిక ధరతో గొర్రెలను అమ్ముకునేవారు. ఈ నేపథ్యంలో బీకేఎస్‌కు చెందిన కాపరితో గొర్రెల కొనుగోలుకు బాలు ఓ ధర కుదుర్చుకున్నాడు. అదే కాపరితో నారాయణస్వామి మరో ధరతో కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నాడు. శనివారం ఉదయం గొర్రెలను తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యాపారులు పరిశీలిస్తుండగా విషయం తెలుసుకున్న బాలు, నారాయణస్వామి అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుని అనుచరులతో కలసి పరస్పర దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని దాడులను అదుపు చేశారు. గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసి, బాలుతో పాటు అతని వర్గానికి చెందిన నలుగురిపై, నారాయణస్వామితో పాటు అతని వర్గానికి చెందిన ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లికి చెందిన హరిజన రామకృష్ణ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ రామకృష్ణ శనివారం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 16 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.

'కీ'లకమైనా కీలుబొమ్మలే!

- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో వింత వైఖరి
- రెగ్యులర్ ఉద్యోగుల కంటే ప్రైవేట్ వ్యక్తులే హల్‌చల్


కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ వ్యక్తి

బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన బోగాతి చంద్రమ్మ తన 4.3 ఎకరాల భూమిని తలారి ఆదినారాయణకు రిజిస్ట్రేషన్ చేయించింది. అయితే.. క్రయ విక్రయదారులు లేకుండానే సబ్ రిజిస్ట్రార్ రామ్మోహన్ ప్రైవేట్ వ్యక్తులతో కలిసి రిజిస్ట్రేషన్ రద్దు చేశారు. ఈ విషయంపై తలారి ఆదినారాయణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రామ్మోహన్‌ను సస్పెండ్ చేశారు. అక్కడే జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నరేంద్రను సైతం బాధ్యుణ్ని చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం ఇటీవల సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ రద్దు విషయంలో తన ప్రమేయం లేకున్నా బలిపశువును చేశారని నరేంద్ర వాపోతున్నారు.

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో చేయని తప్పులకు కొందరు ఉద్యోగులు బలి అవుతున్నారు. ఇప్పటికే ప్రైవేట్ ఉద్యోగులు చేసిన తప్పులకు కదిరి, అనంతపురం రూరల్, చెన్నేకొత్తపల్లి తదితర కార్యాలయాల్లో రెగ్యులర్ ఉద్యోగులు బలయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 120 మందికి పైగా ప్రైవేట్ ఉద్యోగులు పాతుకుపోయారు. వారి కనుసన్నల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగేలా పెత్తనం చెలాయిస్తున్నారు. ఉన్నతాధికారుల అండతో రెగ్యులర్ ఉద్యోగులను కీలుబొమ్మలను చేసి ఆడుకుంటున్నారు.

ప్రైవేట్ వ్యక్తి తప్పు.. ఉద్యోగికి శిక్ష!

బెళుగుప్ప మండలం నరసాపురానికి సంబంధించిన సేల్ డీడ్ డాక్యుమెంట్ రద్దు విషయంలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఓ ప్రైవేటు వ్యక్తి చేసిన తప్పునకు జూనియర్ అసిస్టెంట్ బలిపశువు అయినట్లు తెలుస్తోంది. ఇక్కడ పనులన్నీ సబ్ రిజిస్ట్రార్ కనుసన్నల్లోనే జరుగుతాయి. సబ్ రిజిస్ట్రార్ డ్రైవర్‌గా ఉన్న ప్రైవేట్ వ్యక్తితో పాటు మరో వ్యక్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జోక్యం చేసుకుంటున్నారు. కీలకమైన చెక్‌స్లిప్, ఈకేవైసీ, ఫొటో, ఐరీష్, డాక్యుమెంట్ స్కానింగ్‌కు అనధికారిక ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. వీరిలో ఒకరు నరసాపురం సేల్ డీడ్ డాక్యుమెంట్ రద్దు సమయంలో జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర యూజర్ ఐడీతో లాగిన్ అయ్యి ఫొటోలు మ్యాచ్ కాకున్నా చెక్ స్లిప్‌ను పూర్తి చేసి డాక్యుమెంట్ రద్దు చేశారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్ ఆర్డర్ వేయడంతో రెగ్యులర్ ఉద్యోగులు యూజర్ ఐడీ, పాస్‌వర్డులతో సహా డాక్యుమెంట్ ప్రక్రియ మొత్తాన్ని ప్రైవేట్ ఉద్యోగులకు అప్పగించేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే తంతు కొనసాగుతున్నట్లు తెలిసింది.

మూకుమ్మడి సెలవుపై వెళ్లేందుకు సన్నద్ధం!

చేయని పాపానికి తామెందుకు శిక్షలు అనుభవించాలంటూ రెగ్యులర్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రమూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులను తొలగించకపోతే మూకుమ్మడి సెలవుపై వెళ్లేందుకు రెగ్యులర్ ఉద్యోగులు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇదే విషయాన్ని రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల అసోసియేషన్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం.

ఎవరి యూజర్ ఐడీతో చేస్తే వారే బాధ్యులు

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రతి రెగ్యులర్ ఉద్యోగికి యూజర్ ఐడీ ఉంటుంది. ఐడీతో లాగిన్ అయిన తర్వాతే డాక్యుమెంటేషన్ ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. ఏ ఐడీతో చేస్తే వారే బాధ్యులు. యూజర్ ఐడీపైనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– నాగభూషణం, జిల్లా రిజిస్ట్రార్

క్లుప్తంగా

బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం



బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ కేతన్‌గార్గ్, డీఎస్‌వో శోభారాణి తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజలకు కొంత వెసులుబాటు కల్పించాలని రైతుబజార్‌లో నాణ్యమైన సోనామసూరి రకం బియ్యం విక్రయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. శనివారం పౌరసరఫరా లశాఖ ఆధ్వర్యంలో మిల్లర్లు, ట్రేడర్ల సహకారంతో స్థానిక రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని జేసీ ప్రారంభించారు. కిలో రూ.48 ప్రకారం 10 కిలోల చొప్పున పంపిణీ చేస్తామన్నారు. త్వరలోనే కంది బేడలు కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. ఆదివారం మినహా మిగతా రోజుల్లో విక్రయ కేంద్రం పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో శోభారాణి, ఏడీ మార్కెటింగ్ పి.సత్యనారాయణచౌదరి, సీఎస్‌డీటీ దుర్గాప్రసాద్, యూనియన్ నాయకులు బాషా, ఎస్టేట్ అధికారి ప్రతాప్ రుద్ర పాల్గొన్నారు.

అభాగ్యురాలికి 'అమ్మ' చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నార్పల మండలం చామలూరు గ్రామానికి చెందిన అభాగ్యురాలు రాణికి 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి చేయూతనందించారు. రాణి భర్త రెండేళ్ల క్రితం మృతిచెందాడు. కుటుంబ పెద్ద మరణించడంతో రాణి కూలీనాలి చేసుకొని కొడుకు వినోద్‌కుమార్‌ను పోషించుకుంటోంది. అయితే కొడుకు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి వైద్య ఖర్చుల కోసం రూ.15వేలు నగదు, నూతన వస్త్రాలు, రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. భవిష్యత్తులో మరింత సాయమందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

ఉపాధ్యాయుడు అదృశ్యం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: శ్రీసాగర్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు రమేష్ నాయక్ శుక్రవారం నుంచి కనిపించలేదని భార్య సరస్వతి (ఉపాధ్యాయిని) పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. బెళుగుప్పలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రమేష్‌నాయక్ కుటుంబ కలహాలతో ఇంటినుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని ఆమె ఫిర్యాదు తెలిపింది. మొబైల్ కూడా స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన భార్య.. పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ఉపాధ్యాయుడి కోసం గాలిస్తున్నారు.

మాంటిస్సోరిలో 'హలో..ఎల్లో'



కార్యక్రమంలో పాల్గొన్న కరస్పాండెంట్, కార్యదర్శి, ప్రిన్సిపాల్, విద్యార్థులు

రాప్తాడురూరల్: అనంతపురం గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి పాఠశాలలో 'హలో..ఎల్లో' కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని పసుపు రంగు బూరలు, పూలతో అలంకరించారు. ప్రకృతి, పసుపు రంగులో ఉండే వివిధ రకాల పూలు, పండ్లు, కూరగాయలు, జంతువులు, పక్షులు తదితర వాటిని నర్సరీ, కిండర్ గార్డెన్ చిన్నారులకు పరిచయం చేశారు. చిన్నారులంతా పసుపు రంగు దుస్తులు ధరించి, ఐలవ్‌యూ ఎల్లో అంటూ సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి

రాప్తాడురూరల్: బాల్య వివాహాలను అరికట్టాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. శనివారం అనంతపురం రూరల్ మండలం కురుగుంట సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ సమాజానికి స్త్రీ ఆవశ్యకత ఎంత అవసరమో వివరించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై కొత్తగా వచ్చిన జీఓ 31పై అవగాహన కల్పించాలన్నారు. రూరల్ ఎస్ఐ ప్రవీణ్ మాట్లాడుతూ డయల్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, దిశ యాప్, చదువు ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, మహిళా పోలీస్ విజయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపాల్ హేమలత, టీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ పాల్గొన్నారు.

మ'ధర'ం .. బార్హి ఖర్జూరం

ఎడారిలో పెరిగే వృక్షం.. ఈత చెట్టును పోలి ఉండే ఖర్జూరం.. తియ్యదనంతోపాటు పోషక విలువలు ఈ పండు సొంతం. ఈ పంట సాగు చేయడం సాహసం.. అలాంటి పంట మారుమూల పొలాల్లోనూ పండుతోంది. శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన రైతు కేవీ రమణారెడ్డి తనకున్న ఏడెకరాల్లో ఖర్జూర పంట సాగు చేశారు. 'బార్హి' రకం ఖర్జూరం మొక్కలు మేల్ 50, ఫిమేల్ 450 సాగు చేస్తున్నారు. ఈ రకం ఖర్జూరం అతి మధురంతోపాటు 'ధర' కూడా ఆశాజనకమే. ఖర్జూర పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. హోల్ సేల్‌గా అయితే కిలో రూ.150 ఉండగా, మార్కెట్‌లో ధర రూ.200 వరకు పలుకుతోంది. టన్ను ఖర్జూరం రూ.లక్షకు పైమాటేనని, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు అనంతపురానికి చెందిన వ్యాపారులు తీసుకెళ్తారని రైతు రమణారెడ్డి తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రమణారెడ్డి సాగు చేసిన ఖర్జూరం పంట





ఖర్జూరం గెలను చూపుతున్న రైతు రమణారెడ్డి

జగన్‌తోనే ముస్లింమైనార్టీల సంక్షేమం

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం సాధ్యమైందని మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ అన్నారు. శనివారం నగరంలోని ఆరో రోడ్డులోని హైదర్‌వలి కాలనీలోని మసీద్ ఏ ఉస్మాన్ జునూర్ రైన్ మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మసీదు పెద్దలు, ముస్లింలతో వారు మాట్లాడారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, నాయకులు ముహేబ్, మహమ్మద్ రఫిక్, ఇర్షాద్, కమిటీ సభ్యులు చాంద్‌బాషా, ఖాన్ సాబ్ పాల్గొన్నారు.

'ఉన్మాదిలా మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్'

రాప్తాడు: అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న వలంటీర్లపై ఉన్మాదిలా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేస్తున్నారని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు నాయక్ అన్నారు. ఆయన శనివారం రాప్తాడులో విలేకరులతో మాట్లాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఇంటి నుంచి బయటకు రాలేని సమయంలో కూడా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. గిరిజన తండాల్లో ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు దుర్మార్గపు పనులకు తెరలేపారన్నారు. పవన్‌కళ్యాణ్ తక్షణం వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



రేషన్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తూ, అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం అనంతపురం రూరల్ పంచాయతీలో సర్పంచ్ ఉదయ్‌శంకర్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత హాజరై వివిధ రకాల సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాము పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. కార్పొరేటర్ హరిత, ఎంపీటీసీ జ్యోతి, ఉప సర్పంచ్ సుమిత్ర, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 9,10,23,24,25,26,39 డివిజన్లకు సంబంధించి వివిధ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటూ పవన్ కళ్యాణ్ డైలాగులు, పంచ్‌లు వేస్తున్నారని, ఆయనకు ప్రజల పట్ల చిత్తశుద్ధి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. వలంటీర్లపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేక టీడీపీ, బీజేపీ, జనసేన కుట్రలు చేస్తున్నాయన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. నగరంలోని 39వ డివిజన్‌లో జరిగిన 'జగనన్న సురక్ష' సభలో 26 మంది వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మాజీ మేయర్ రాగే పరుశురాం, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట మధు, కార్పొరేటర్లు ఎం.దేవి, వై.లక్ష్మిదేవి, సుమతి, బాబాఫకృద్దీన్, లీలావతి, రామాంజనేయులు, సైపుల్లాబేగ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.



విపత్కర పరిస్థితుల్లో మేము సైతం

వలంటీర్లకు వందనం

రాప్తాడు: కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాప్తాడు మండలంలోని ఎం.బండమీదపల్లికి చెందిన వలంటీర్ బిల్లే అనిల్ కుమార్ తన ప్రాణాలకు ఎదురొడ్డి సేవలు అందించాడు. క్షేత్ర స్థాయి సిబ్బందితో కలిసి రెడ్ జోన్లలో కరోనా పీడితులకు కావాల్సిన సహాయ సహకారాలు అందించాడు. కరోనా తీవ్రంగా ఉన్న రోజుల్లో రోజూ గ్రామంలో తిరిగి, ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటూనే కరోనా నియంత్రణపై జాగ్రత్తలు తెలియజేసేవాడు. కరోనా సోకిన వారిని క్వారంటైన్‌కు తరలించడం, వారితో కాంటాక్ట్ ఉన్న వారిని పరీక్షలు చేయించడంలో ధైర్యంగా ముందుకు సాగాడు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పంపిణీ శానిటైజర్లు, మాస్క్‌లను గ్రామస్తులకు అందించేవాడు. తన పరిధిలోని కుటుంబాల్లో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నాడు.

వలంటీర్ సేవలు మరువలేనివి



కరోనా సోకుతుందని మనిషికి మనిషి దూరమైన సమయంలో మాకు మా వలంటీర్ బిల్లే అనిల్ కుమార్ అందించిన సేవలు మరువలేనివి. ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న మాకు వలంటీర్ పలకింపు, అతను అందించిన సహకారం మరచిపోలేం. ప్రస్తుతం మేము అనంతపురంలో సంగమేష్ సర్కిల్లో ఉంటున్నాం. గత ఏడాది క్రితం పక్షవాతం రావడంతో నడవలేని స్థితిలో ఉన్నా. అప్పటి నుంచి వలంటీర్ అనిల్ కుమార్ దాదాపు 30 కిలోమీటర్ల దూరం అనంతపురానికి వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తున్నాడు. ఇలాంటి సేవ చేసే వాళ్లను పవన్ కళ్యాణ్ తిట్టడం దారుణం.

– భక్తవత్సలం, ఎం.బండమీదపల్లి

ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోండి





ఎం.చెర్లోపల్లి, పాపంపేటలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాప్తాడురూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ ఓబులమ్మ కోరారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని 5వ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి అశోక్ అధ్యక్షత వహించారు. డీఎల్‌డీఓ ఓబులమ్మ, మండల స్పెషలాఫీసర్ మల్లికార్జునప్ప, ఎంపీడీఓ పుల్లయ్య హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ జగనన్న సురక్ష కింద 1,389 దరఖాస్తులు అందాయని, అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, సచివాలయ కార్యదర్శులు బాలచంద్రారెడ్డి, మహేంద్ర, జేసీఎస్ మండల కన్వీనర్ మతం శ్యాంసుందర్, ఎంపీటీసీ సభ్యులు కురుబ వెంకటేశ్వర్లు, సందీప్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పంచాయతీ కన్వీనర్ మాదన్న, నాయకులు టి.గోపాల్‌రెడ్డి, ఎర్రిస్వామి, వలంటీర్లు, గృహ సారథులు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాప్తాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శనివారం మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో ఎంపీడీఓ సాల్మన్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ పసుపుల నరసింహాగౌడ్, జిల్లా ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు బోగే లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు బోగే రామచంద్రారెడ్డి, కపాడం కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీయాగం







అలంకరణలో అమ్మవారు , పాతూరు అమ్మవారి శాలలో కోటి కుంకుమార్చన చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు



ముత్తైదువులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్య వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో పదిరోజులుగా నిర్విరామంగా సాగుతున్న లలితాదేవి కోటి కుంకుమార్చన, చండీయాగం శనివారం ముగిసింది. పాతూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏకరూప వస్త్రధారణతో వందల సంఖ్యలో మహిళలు బారులుతీరి అమ్మవారి భక్తిగీతాలు ఆలపిస్తూ కుంకుమార్చన చేశారు. ముత్యాల చీరలో అలంకారంలో దర్శనమిచ్చిన వాసవీమాతను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో చండీయాగాన్ని వేదపండితులు ముగించారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన వివిధ నైవేద్యాలను భక్తులకు వితరణ చేశారు.

ముత్తైదువులకు సుహాసినీ పూజలు : పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కోటి కుంకుమార్చన ముగింపు సందర్భంగా శనివారం పలువురు మహిళలను సత్కరించారు. 73 ఏళ్ల సత్యభామకు సుమంగళి, సుహాసినీ పూజలు చేసి సత్కరించారు. కార్యక్రమంలో మహిళా మండలి ప్రతినిధులు స్వర్ణలత, పద్మజ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: ఆషాఢమాసంలో అంతంలో వచ్చిన శనిత్రయోదశి వేడుకలు పలు చోట్ల భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానిక బెంగళూరు రోడ్డులోని శివకోటిలో పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి సేవలో సందడి చేశారు. స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరాలయం, మారుతీనగర్ కోదండరామాలయం, పాతూరు శ్రీ విరూపాక్షేశ్వరాలయం, మొదటిరోడ్డు శివాలయం తదితర చోట్ల శనేశ్వరుడికి తైలాభిషేకాలు, గ్రహదోష పూజలు, అర్చనలు జరిగాయి.

జగనన్న ప్రభుత్వంలోనే ప్రజలకు న్యాయం



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రజలకు న్యాయం జరుగుతోందని ప్రాథమిక వ్యవసాయ ప్రాథమిక సంఘం చైర్మన్ (పీఏసీఎస్) తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు తోపుదుర్తి కుటుంబం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా నిరంతరం అందుబాటులో ఉండి, ఎమ్మెల్యే పరిష్కరిస్తున్నారన్నారు.తోపుదుర్తి ట్రస్ట్ ద్వారా ఉచితంగా బోర్లు, అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి పాడి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షరిమ్మల, సర్పంచ్ ఓబులేష్, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, ఎంఈఓ రామాంజనేయులు,ఎంపీటీసీ పోతులయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, అతికిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో జగనన్న సురక్ష సర్వే ..

మండల కేంద్రంలో ఎంపీపీ సుబ్బర హేమలత, గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు, వలంటీర్లు ఇంటింటా తిరిగి జగనన్న సురక్ష కార్యక్రమంపై శనివారం సర్వే చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు మంజూరులో ఏమైనా సమస్యలున్నాయా? అర్హులైనా పథకాలు అందలేదా ? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న 11 రకాల ధ్రువీకరణ పత్రాలపై వివరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగస్తులు షబానా, ప్రభాకర్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు మురళి, శ్రీరామ్ ఓటీ టైలర్ వెంకటేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం కల్చరల్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని యోగా గురువులు తెలియజేశారు. జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి యోగా శిక్షణ శిబిరంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ యోగా ప్రక్రియలు వివరించారు. యోగదా సత్సంగ మండలి ప్రతినిధులు స్వామి స్మరణానంద గిరి, స్వామి ప్రజ్ఞానందగిరి, స్వామి కేదారానంద గిరి సాధకులతో వివిధ యోగా ప్రక్రియల ప్రాధాన్యతను తెలియజేశారు. జిల్లా కేంద్ర ప్రతినిధులు చంద్రశేఖర్, నరసింహులు, సురేష్, కేశవరెడ్డి, రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం క్రైం: నగరంలోని 40వ డివిజన్‌లోని గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో రోడ్డు, కాలువ నిర్మాణ పనులకు డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షరీఫ్, ఖాదర్, ఇస్సాక్, జనార్దన్‌రెడ్డి, మణి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

21 నుంచి ఓటరు జాబితాపై ఇంటింటా సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహ

రాప్తాడు: ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా పక్కాగా జాబితా సిద్ధం చేసేందుకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీ నరసింహ తెలిపారు. శనివారం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తదితర అంశాలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాలతో ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ప్రతి ఇంటికీ బీఎల్‌ఓలు వస్తారని అన్నారు. సర్వే సమయంలో రాజకీయ పార్టీల నాయకులు అందుబాటులో ఉండి బీఎల్‌ఓలకు సహకరించాలన్నారు. 1,200 ఓట్లు దాటి ఉన్న పోలింగ్ కేంద్రాల విభజన కోసం గ్రామస్తుల వినతి మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈడీటీ మల్లికార్జున, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టిగా పనిచేయాలి

అనంతపురం సెంట్రల్: గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టిగా పని చేయాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శనివారం సచివాయల మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో ఆన్‌లైన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

రాప్తాడు: అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది, నిస్వార్థమైనదని ఎంఈఓలు మల్లికార్జున, కుళ్లాయప్ప పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఆంజనేయులు అధ్యక్షన హెచ్ఎం రంజిత్ పోమర్, ఉపాధ్యాయులు రేవతి, విజయశాంతి, నరసింహులు, సూర్యనారాయణ సన్మాన సభ జరిగింది. వారు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, ఉన్నత స్థాయికి చేరేలా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుడికే సాధ్యమన్నారు. చదవుతో పాటు నైతిక విలువలు, సమాజసేవ, మానవతా విలువలు నేర్పించాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు నారాయణస్వామి, ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాసులు, బాల కదిరప్ప, నందగోపాల్, భాస్కర్ రెడ్డి, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మోహన్

అనంతపురం కల్చరల్: వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనంతకు చెందిన వై.మోహన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం ఏపీ వినియోగదారుల సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడిగా ఉన్న మోహన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల జిల్లా వినియోగదారుల సంఘాలు హర్షం ప్రకటించాయి.